# మారిపోయిన విలువలు

॥ క థా ని క ॥

ద్రోణంరాజు కృష్ణమోహన్

"ఈ అర్ధరూపాయి చెల్లదు, ఇంకోకటివ్వండి" కండక్టరు హుకుంకి జనార్దనానికి విసుగొచ్చింది. జేబులో చెయ్యిపెట్టిచూశాడు. వేరే చిల్లర లేదు. పదిరూపాయల నోటు వున్నది.

"ఎందాకా వెళ్ళాలి మీరు?" ప్రక్కనే మరొక యువకుడడిగాడు.

"టెర్మినస్‌లో దిగాలి."

"నేనిస్తానుండండి మూడణాలు" అని జేబు లోంచి తీసిచ్చాడు.

"థాంక్స్. మీరూ టెర్మినస్ దాకా వస్తారా?"

"రానులెండి, ఫరవాలేదు. మూడణాలు భాగ్యం కాదు" నవ్వాడు. జనార్దనం అతన్ని లోలోపల ఎంతో మెచ్చుకున్నాడు. గడ్డం మాసివుంది. తల కూడా పెరిగింది. బట్టలు చినుగులతో వున్నాయి.

"మీరేం చేస్తున్నారు?" కుతూహలంకొద్దీ అడిగాడు జనార్దనం.

"ఖాళీ. ఏవో రెండుమూడు చిల్లర వుద్యోగాలు చేశాను. అవికూడా యిప్పుడు లేవు. ఇదిగో యీ కవరులో నా ఇంటర్ సర్టిఫికెట్ వగైరా వున్నాయి. ఉద్యోగం కోసమే యీ వూరు వచ్చాను." అని కవరులోవి తీసి చూపించాడు. మార్కులు బాగా వచ్చాయి.

"స్టడీస్ కంటిన్యూ చెయ్యకపోయారా?"

"హుఁ..." అని నిట్టూర్చి, దీనవదనంతో "ఆ భాగ్యం అందరికీ వుండొద్దూ?" అన్నాడు. జనార్దనానికి మనస్సు చివుక్కుమంది. పాపం అవతారం చూసి కూడా, ఎందుకా ప్రశ్న వేశానా అనుకున్నాడు.

"మీ పేరు?"

"రాజారావ్."

"ఎక్కడ దిగారు?"

"సత్రం అరుగులు. ఎవరైనా స్నేహితులు కన్పించి ఆశ్రయమిస్తే పీలయినన్నాళ్లు అక్కడ. ఇప్పటికి రెండునెలలనుంచి యీ వుద్యోగం వేట."

"నిజమే. ఈ సమస్య మరీ తీవ్రంగా వుంది. పైగా వెధవ పక్షపాతం ప్రతిచోటా. కులతత్వాలు వ్యక్తిగత అభిమానం, లంచగొండితనం, ఎన్ని వచ్చాయి!" తాను అసిస్టెంటు ఎలక్ట్రికల్ ఇంజనీరు పదవికి రావడానికి పడిన యిబ్బందులన్నీ చెప్పుకున్నాడు.

"మీ యిల్లు?"

"టెర్మినస్‌కు దగ్గరే" అంటూండగానే రాజారావు దిగవలసిన స్టాపింగ్ వచ్చింది.

"వస్తా" అని లేవబోయాడు.

"పోనీ టెర్మినస్ దాకా రండి. అర్జంటు పని వున్నదా?"

"అర్జంటేమీలేదు. సరే వస్తా" అని టికెట్ మళ్ళీ అందాకా కొన్నాడు. కబుర్లు కాసేపు సాగాయి. రాజారావుకి సహజమైన అందానికి తోడు, అద్భుతమైన తెలివితేటలు, మంచి చమత్కారం కూడావున్నాయని యిట్టే గ్రహించాడు జనార్దనం. టెర్మినస్‌లో యిద్దరూ దిగారు.

"ఇప్పుడెక్కడికెడతారు?"

"ఇక్కడ ఒకబ్యాంకులో దరఖాస్తు పడేశాను. ఏమయిందో కనుక్కుని నెమ్మదిగా వెనక్కి నడిచి వెళ్ళి అక్కడ పెద్దహోటల్లో గుమాస్తా ఖాళీ సంగతి ఏమితేల్చారో కనుక్కుని సత్రానికి చేరుకొంటా రాత్రికి."

"ఏ సత్రం?"

"స్టేషన్ దగ్గరే."

"అబ్బో చాలా దూరం. పోనీ యీ రాత్రి మా యింటికి రండి. మా అమ్మ, చెల్లి, యింకా రాలేదు" అని ఎడ్రసిచ్చాడు. మరో స్నేహితుడు దొరికినందుకు రాజారావు చాలాపొంగిపోయాడు.

* * *

నిజంగా రాజారావు వస్తాడని జనార్దనం అనుకోలేదు. కుర్చీలో కూర్చుని రేడియోసంగీతానికి తన

సంగీతం జోడిస్తున్నాడు. ఏవో మ్యాగజైనులు తిరగేస్తున్నాడు.

"పంతులుగారూ" తలుపు బాదిన చప్పుడు విని లేచి తీశాడు. రాజారావు ప్రవేశించాడు.

"ఓ వచ్చారా. రండి" హృదయపూర్వకంగా ఆహ్వానించాడు.

"కాసిని మంచినీళ్లు" అని కూజాచూసి అటు వైపు వెళ్ళాడు.

"అవి మంచివికావు. నిన్నటివి. ఇవిగో మరచెంబు లోనివిస్తాను"అని తీసి గ్లాసులో పోసియిచ్చాడు.

"ఇల్లు చాలా బాగుందండి."

"ఏదో చిన్న డాబాయిల్లు. దీనిమీద యింకా అప్పు రెండువేలదాకా వున్నది. ప్రక్కవాటా 50 రూపాయల అద్దె ఆ అప్పులవాళ్ళే వసూలు చేసుకుంటారు. నా ఉద్యోగం, ఈ యిల్లు మినహా మరేమీ లేదండోయ్. రేడియో, సోఫాలు, చూసి నేను లక్షాధికారిననుకునేరు!" అని నవ్వాడు జనార్దనం. రాజారావు కూడా కలిసి నవ్వాడు.

"మీరు భోంచేశారా, అన్నట్లు?" మళ్ళీ అడిగాడు.

"ఆ. మధ్యాహ్నం ఒంటిగంటకు తిన్నాను. ఆకలిలేదు." రాజారావు సమాధానంలోగల అర్థం జనార్దనం గ్రహించాడు. నిరుద్యోగిఅవస్థలు అతనికి బాగా తెలుసు.

తెల్లవారింది. ఇద్దరూ మొహాలు కడుక్కుని స్నానాలు చేశారు. పనిమనిషి కాఫీ తెచ్చింది. ఇద్దరూ త్రాగారు.

"మరిప్పుడెక్కడికి ప్రయాణం?" జనార్దనం అడిగాడు.

"ఒక చోటేమిటి? రమ్మన్నచోటికీ రావద్దన్న చోటికి, ఎటూ చెప్పని చోటుకీ, అన్నిచోట్ల కూనూ."

"సరే. మీ యిష్టం వచ్చినపుడు రావచ్చు. రెండో తాళం చెవి యిదిగో" అని చేతికిచ్చాడు.

నాలుగు రోజులు గడిచాయి. రాజారావుకి ఎక్కడా వుద్యోగం దొరకలేదు. తిరుగుతూనే వున్నాడు. నోరు తెరిచి అడగలేక పోతున్నాడని గ్రహించి జనార్దనం స్వయంగా తనే ఐదు రూపాయలవరకూ అతని చేతికిచ్చాడు. ఇదిగాక హోటల్ టిక్కెట్లు కూడా యిస్తున్నాడు.

ఓకరోజు సాయంత్రం జనార్దనం వచ్చేసరికి రాజారావ్ చాపమీద పడుకుని వున్నాడు. అమృతాంజనం ఘాటువేస్తోంది. ప్రక్కనే వాంతి చేసుకుని కడిగినట్లు చారలు కనిపిస్తున్నాయి.

"రాజారావ్ గారూ,..."నెమ్మదిగా పిలిచాడు.

"ఉఁ..."అని మూలుగుతూ కళ్ళు తెరిచి చూశాడు. దీపపు కాంతికి కళ్లు పొడిచినట్లు బాధ పడి మళ్ళీ మూసుకున్నాడు.

"జ్వరం తగిలిందా?"

"మరేనండి. కొద్దిగా" జనార్దనం థర్మామీటరుతో టెంపరేచరు చూశాడు. 101 వున్నది.

"డాక్టరుని తీసుకొస్తా"

"వద్దండి. అదే జారిపోతుంది" పడుకున్నాడు.

ఆ రాత్రి తెల్లవార్లూ దగ్గుతూనే వున్నాడు. అక్కడికీ జనార్దనం నిద్రకు భంగం కలుగుతుందేమోనన్న వ్యథతో మరీ దగ్గువచ్చినపుడు గేటు దగ్గరికెళ్ళి దగ్గేవాడు. జనార్దనం రోజల్లా ఆఫీసులో పని చేసివచ్చాడు. నిద్రకు కొంచెం భంగం కలిగినమాట వాస్తవమే. అయినా ఆ పరిస్థితిలో ఏమనగలడు?

రెండు రోజులయినా జ్వరం, దగ్గు తగ్గలేదు. పగలు తగ్గినట్లు కన్పించడం, రాత్రిళ్ళు ఎక్కువవడం జనార్దనానికి యిది చూస్తే ఆందోళనతోపాటు విసుగు కూడా కలిగింది. ఏదో ధర్మాసుపత్రికిపోయి మందు తెచ్చుకుని తాగుతున్నాడు రాజారావు. మూడు రాత్రిళ్ళు వరుసగా జనార్దనానికి నిద్రలేదు. పైగా అతనికి రొట్టె, కాఫీ, సగ్గుబియ్యం జావ, వగైరా ఏర్పాట్లన్నీ తనే చేయాల్సి వచ్చింది.

"పోనీ మీవాళ్ళ వూరెళ్ళండి. రైలులో ఎంతసేపు ప్రయాణం? సెకండు క్లాసులో హాయిగా వెళ్ళండి. డబ్బు సంగతి నేను చూస్తాను. ఒళ్లు బాగుచేసుకుని తిరిగిరండి" నిజానికి అతన్ని వదిలించుకోవాలనే వుద్దేశంతో నేఅన్నాడు జనార్దనం. అందులోని అర్థం తెలుసుకున్నాడు రాజారావు.

"అలాగే లెండి. వెడితే వెడతాను, లేకపోతే ఆస్పత్రికి కొంచెం దగ్గిరగా నా పాత క్లాస్ మేట్ ఒక రూమ్‌లో వుంటున్నాడు. అక్కడ కెడతాను" అన్నాడు.

"ఎబ్బె. అందు...కోసం...లే...దు" గొణిగాడు జనార్దనం.

ఆ సాయంత్రం జనార్దనం వచ్చేసరికి తలుపు తాళంవేసి వుంది. తలుపు తీసి లైటువేశాడు. ఒక చిన్న కాగితం, ఒక పోస్టుకార్డు వున్నాయి. రెండూ చదివాడు.

"జనార్దనంగారూ,

ఇన్నాళ్లూ మీరు చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞుడను. ఎంతో ఋణపడివున్నాను. ఏదో విధంగా తీర్చుకోలేకపోను. మీకు బాధ కలిగించ దలచుకోలేదు. ఒళ్లు బాగయ్యాక మళ్ళీ మీకు కనిపిస్తా-సెలవు.

రాజారావు"

కాగితంలో వున్న ముక్కలు అవి. కార్డు చదివాడు.

"చిరంజీవి జనార్దనానికి,

ఇక్కడంతా క్షేమం. నువ్వు కులాసా అని తలుస్తాము. నేను మన సుగుణ సంబంధం గురించి కనుక్కున్నాను. ఆ కుర్రవాడు చాలా అందమైన వాడు, తెలివితేటలు గలవాడు అని అంతా చెప్పారు. ఇంటర్ ప్యాసయ్యాడు. ఉద్యోగం కోసం యిప్పుడు మన వూరొచ్చాడట. ఎవరో స్నేహితుల యింట్లో దిగాడుట. కుర్రాడి పేరు రాజారావుట. తల్లిదండ్రులు లేరు. పైదనాన్న పెంచి చదువు చెప్పించి వదిలేశాడు. మన కిది వరకు మందిచ్చే ఆచార్యులగారి నడిగితే ఆ కుర్రాడు ఎక్కడుండేదీ తెలుస్తుందని పెదతండ్రి చెప్పాడు. తక్షణం వెళ్ళి కుర్రవాడిని పరిచయం చేసుకుని ఎల్లుండికి మన యింటికి తీసుక్కురావలెను. నేను రేపు రాత్రి మెయిల్‌లో బయలుదేరి వస్తున్నాను. స్టేషనుకు రావలెను.

మీ అమ్మ, రాజేశ్వరి."

"హరి భగవంతుడా! ఎంత ఘోర తప్పిదం జరిగింది!" జనార్దనానికి మతిపోయినట్లయింది. "ఎలా యిప్పుడు? ఎక్కడికి వెళ్ళడం! ఎలా అతని ముఖం చూడటం!" తెల్లవార్లూ నిద్రపోలేదు.

పొద్దున్నే స్టేషను కెళ్ళి తల్లినీ, చెల్లెల్నీ, తీసుకొచ్చాడు యింటికి.

"ఏమిరా కనుకున్నావా రాత్రి?" తల్లి అడిగింది.

"అమ్మా, చాలాపొరపాటు జరిగింది." అంటూ జరిగిందంతా చెప్పాడు.

"అయ్యో! చప్పున యివ్వాళ సెలవుపెట్టయినా సరే, పాపం తీసుకురారా ఎక్కడున్నాడో వెతికి" తొందరబెట్టింది.

"అలాగేలే అమ్మా...ఊరంతా గాలించి మరీ తీసుకొస్తాను." ఆలాగే పరుగుతీశాడు. రాజారావు వుండిన సత్రం, స్నేహితుల ఇళ్ళు, తిరిగే వీథులూ అన్నీ గాలించాడు. ఎక్కడా కనిపించలేదు. కబురు కూడా తెలియలేదు.

సాయంత్రం అయింది. అయినా రాజారావు జాడలేదు. చీకటిపడుతోంది. చలికాలం అవడం చేత అప్పుడే గజగజ వణికించేస్తోంది. జనార్దనం బస్సుస్టాపింగ్ దగ్గిర ఆగాడు బస్సుకోసం.

...దగ్గిన శబ్దం వినిపించింది. వెనక్కి తిరిగి చూశాడు, పార్కు! మనిషి కనిపించలేదు. మళ్ళీ దగ్గిన శబ్దం...ధ్వని గుర్తుపట్టాడు జనార్దనరావు. గోడమీదనుంచి ఒక్క దూకుదూకాడు లోపలికి. సిమెంటు బెంచీకి ప్రక్కనే గుబురుగా పెరిగిన చెట్టుచాటున దట్టంగా ముసుగు కప్పుకున్న వ్యక్తి. అగ్గిపుల్ల వెలిగించి చూశాడు.

"రాజారావ్ గారూ...క్షమించాలి." అతని చేతులు రెండుపుచ్చుకున్నాడు, "రండి, లేవండి వెడదాం." లేవదియబోయాడు.

"వద్దు, మీకు పాపం శ్రమ. ఇప్పటికే చాలా ఋణపడ్డాను."

"అలా అనకండి. నేను చాలా బాధపడుతున్నాను. మానవ సహజమైన దయ, మిత్రత్వ స్వభావంతోపాటు పొరపాటుకూడా చేశాను. మన్నించాలి!" రెండు చేతులు మళ్ళీ పుచ్చుకున్నాడు. రాజారావు లేవక తప్పలేదు. ఖాళీగా పోతున్న టాక్సీ వారిముందు ఆగింది.

